క్లుప్తంగా

వైభవంగా ధ్వజారోహణ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం వివిధ పూజలు జరిగాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు శేషవాహన సేవ, సామూహిక లక్ష్మీనారాయణ పూజ జరిగింది. ఉభయకర్తలుగా జనకల వెంకటనాగేంద్రరావు, లావణ్య వ్యవహరించారు. నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంద్యాల రమణయ్య, కొమ్మి వేణుగోపాల్, ఎం.శ్యామ్‌ప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాసులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ



సర్టిఫికెట్లతో ఎన్‌సీసీ క్యాడెట్లు

వెంకటాచలం: మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న అక్షర విద్యాలయంలో పదిరోజుల పాటు జరిగిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కల్నల్ కరమ్‌చంద్ మాట్లాడుతూ.. శిక్షణతో సామాజికసేవ, క్రమశిక్షణ, దేశభక్తి పెరుగుతుందన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన క్యాడెట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మేజర్ రాజేష్‌కుమార్, హేమంత్‌కుమార్, క్యాంప్ అధికారి బాలబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు జీవితం ఆదర్శనీయం



కొడవలూరు: టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఆదర్శనీయమని విశ్రాంత హెచ్‌ఎం వెంకయ్య పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. లైబ్రేరియన్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కళాకృతుల తయారీ



కళాకృతులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని గ్రంథాలయంలో కాగితాలతో వివిధ కళాకృతులను విద్యార్థులు మంగళవారం తయారు చేశారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా వీటిపై అవగాహన కల్పించామని ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రంథాలయాధికారి మంజులత పాల్గొన్నారు.

లింగవివక్ష తగదు



కొడవలూరు: లింగవివక్ష చూపడం తగదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ పేర్కొన్నారు. లింగవివక్షను సామాజిక దురాచారంగా అభివర్ణిస్తూ పిల్లలతో నాటక ప్రదర్శనను మంగళవారం నిర్వహించి అవగాహన కల్పించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా నార్తురాజుపాళెంలోని దళితవాడలో నిర్వహించిన కార్యక్రమంలో హెల్పర్ శ్రావణి పాల్గొన్నారు.

⇨ యల్లాయపాళెంలోని దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, హెచ్ఎస్ సురేంద్ర, హెచ్ఏ సురేష్, అంగన్‌వాడీ కార్యకర్త సుమలత పాల్గొన్నారు.

⇨ నీలగిరి సంఘం గిరిజన కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, జ్ఞానప్రసూన, అంగన్‌వాడీ కార్యకర్త శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

⇨ **పొదలకూరు:** ఆడ, మగ అనే తేడా ఉండకూడదని, ఇద్దరినీ సమానంగా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ అన్నారు. కిశోరి వికాసం – వేసవి శిక్షణలో భాగంగా మంగళవారం తాటిపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీ ఇందిరమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ నరసమ్మ, వీఓఏలు సుజాత, సుధారాణి, ఆశా కార్యకర్తలు లక్ష్మీకాంతమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అంతా ఇష్టారాజ్యం

- నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణం
- సెట్‌బ్యాక్‌నూ వదల్లేదు
- నోటీసులిచ్చినా పట్టించుకోని యజమాని
- ముడుపులతో మేనేజ్ చేస్తున్న వైనం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు జరుగుతుంటే చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ కార్యాలయ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఓ బహుళ అంతస్తు నిర్మాణంపై కార్పొరేషన్ అధికారులకు ఇప్పటికే అనేక ఫిర్యాదులు అందాయి. దీంతో నోటీసులను రెండుసార్లు జారీ చేశారు. అయినా సదరు భవన యజమాని దాదాపు 95 శాతం మేర నిర్మాణ పనులను పూర్తి చేశారు. వాస్తవానికి 107 అంకణాల ఖాళీ స్థలంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని గతేడాది ఆగస్టులో ప్రారంభించారు. జీ + 4 అంటే సెల్లార్‌తో కలిపి నిర్మించుకునే ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే అధికారులు పరిశీలించి తిరస్కరించారు. నిర్మాణానికి ముందు వైపు మూడు మీటర్లు, కుడి, ఎడమ వైపున రెండు మీటర్లు, వెనుక వైపు రెండున్నర మీటర్ల సెట్‌బ్యాక్ వదిలాలి. అలా కాకుండా వంద శాతంతో డీవియేషన్‌తో నిర్మిస్తుండటంతో ప్లాన్ అప్రూవల్ కాలేదు. అయినా నిర్మాణాన్ని 90 శాతం పూర్తి చేశారు. ఇంత జరుగుతున్నా ఎవరూ కన్నెత్తి చూడటంలేదు. దీనికి గానూ భారీగా ముడుపులు పుచ్చుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికార పార్టీ నేత అండ

కార్పొరేషన్ కార్యాలయంలో కీలకంగా వ్యవహరిస్తున్న అధికార పార్టీకి చెందిన నేత సదరు భవన యజమానికి అండగా ఉండటంతో ఇలా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. సదరు నేతకు సైతం భారీగా ముడుపులు ముట్టాయని సమాచారం. కాగా ఈ విషయమై కమిషనర్ నందన్‌ను ఫోన్లో సంప్రదించగా, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న జీ + 4 భవన నిర్మాణానికి అనుమతి లేదని తెలిపారు. నిర్మాణాన్ని తాను పరిశీలించానని చార్జిషీట్‌ను వెంటనే ఫైల్ చేయాల్సిందిగా టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించానని బదులిచ్చారు.



అనధికార నిర్మాణాలకు నోటీసులు

నెల్లూరు(బారకాసు): నగరంలో అనధికారికంగా నిర్మిస్తున్న భవనాలకు నోటీసులను జారీ చేసి చార్జిషీట్‌ను దాఖలు చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరంలోని వనంతోపు, భక్తవత్సలనగర్, కరెంటాఫీస్ కూడలి తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. అవసరమైన ప్రాంతాల్లో కాలువలు, రోడ్ల నిర్మాణానికి అంచనాలను సిద్ధం చేయాలని సూచించారు. రోడ్లను ఆక్రమిస్తూ ఎలాంటి నిర్మాణాలను చేపట్టొద్దని, అలా వ్యవహరిస్తే కూల్చేస్తామని స్పష్టం చేశారు.

⇨ మేజర్, మైనర్ కాలువల్లో పూడికతీత కోసం నూతన మెషీన్‌ను ద్వారా చేపట్టిన పనులను కమిషనర్ నందన్ పరిశీలించారు. రామ్మూర్తినగర్‌లోని ప్రధాన కాలువకు జెన్ రోబోటిక్స్ మెషీన్‌ను అనుసంధానించి చేపట్టిన పూడికతీత పనులను ఆయన పర్యవేక్షించారు. ఇంజినీరింగ్ విభాగ ఈఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

⇨ ట్యాక్స్ రివిజన్ సర్వేకు అధిక ప్రాధాన్యమివ్వాలని కమిషనర్ నందన్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ శాఖతో నిర్వహించిన వారాంతపు సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అడ్మిన్ కార్యదర్శులు, సచివాలయ ఇతర కార్యదర్శులతో సమన్వయం చేసుకుని సర్వేను నిర్వహించాలని సూచించారు.



మెషీన్ ద్వారా చేపట్టిన పూడికతీత పనులను పరిశీలిస్తున్న నందన్

గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే డిమాండ్‌ను 20 శాతం అదనంగా పెంచాలని సూచించారు. సర్వేలో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

⇨ నగరంలోని వివిధ మున్సిపల్ పాఠశాలల్లో అధునాతన వసతులను దాతల సహకారంతో కల్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ నందన్ సూచించారు. వీఆర్ విద్యాసంస్థల ప్రాంగణం, మూలాపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలకు అవసరమైన అన్ని ఆధునిక ఏర్పాట్లను డీఎస్సార్ సంస్థ ద్వారా సమకూరుస్తామని చైర్మన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డును బాగుచేశారు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(బారకాసు): నగరంలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులతో రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ఆయా ప్రాంత ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే నాలుగో డివిజన్ పరిధిలోని మారుతినగర్ అంతర్గత రోడ్డు కుంగిపోవడంతో పాటు రొచ్చురొచ్చుగా మారింది. ఈ క్రమంలో ‘అస్తవ్యస్తం’ అనే శీర్షికన సాక్షిలో కథనం మంగళవారం ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు స్పందించారు. కుంగిన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. రోడ్డును మట్టితో చదును చేసి, ఆపైన సన్నటి కంకరను పోయడంతో సమస్య పరిష్కారమైంది.



భూ సమస్య పరిష్కారానికి వినతి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): భూ సమస్యను పరిష్కరించాలని గోపాలమ్మ కోరారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడారు. కొరుటూరులోని వివిధ సర్వే నంబర్లలో 1.60 సెంట్ల మాగాణి భూమి ఉందని చెప్పారు. సదరు భూమి వివాదంలో ఉన్న తరుణంలో పర్మనెంట్ ఇంజెక్షన్ ఆర్డర్‌ను పొందానని తెలిపారు. సర్వే జరపాలని గతంలో కలెక్టర్‌గా ఉన్న జానకి ఉత్తర్వులు జారీ చేసినా, ఎవరూ రాలేదని చెప్పారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.



మహిళా ఉద్యోగులపై వివక్ష తగదు



సీహెచ్ఓల నిరసన

నెల్లూరు (అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ముఖ్యంగా మహిళా ఉద్యోగులపై ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని సీహెచ్ఓల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్ పేర్కొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద సీహెచ్ఓలు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారంతో 22వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్‌హెచ్‌ఎంలో 197 క్యాడర్ల ఉద్యోగులుంటే అందులో 196 క్యాడర్లకు న్యాయం చేసి ఒక్క సీహెచ్ఓలకు మాత్రమే పీఆర్సీ లేకుండా చేయడం దారుణమన్నారు. ఆరేళ్లుగా పని చేస్తున్నా, కనీసం ఒక్క ఇంక్రిమెంట్‌నూ ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు.

తమ ఉద్యోగుల్లో 95 శాతానికి పైగా మహిళా ఉద్యోగులున్నారని, వీరిపై ప్రభుత్వం వివక్ష చూపడం, సమస్యలపై చర్చించకపోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. మృతి చెందితే కనీసం అంత్యక్రియల ఖర్చులకు కూడా నగదు ఇవ్వడం లేదన్నారు. తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు. తమ ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని, అంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సంఘం జిల్లా కో ఆర్డినేటర్ ఆదిల్, లావణ్య, చంద్రకళ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): యోగా మహోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న వారు, వాకర్స్‌కు 1500 మజ్జిగ ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. వీటిని వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ – 203 ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు ఆధ్వర్యంలో వెంకటరత్నం సౌజన్యంతో అందజేశారు.

⇨ నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో పాల్గొంటున్న వారికి పౌష్టికాహారాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. మారం అపర్ణ జ్ఞాపకార్థం కార్యక్రమాన్ని మారం రమణారెడ్డి చేపట్టారు. గౌరవాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, చింతల అమరేంద్రరెడ్డి, సెక్రటరీ పొన్నం రవిచంద్ర, చంద్రమౌళి, గోపాల్‌రెడ్డి, రాజా రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, సుబ్బరాజు, విజయమోహన్‌నాయుడు, స్వర్ణ రమేష్, ఖలీల్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి స్వర్ణ పతకం



నెల్లూరు (టౌన్): నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థి కాళిదాసు వెంకటకార్తీక్ స్వర్ణ పతకాన్ని సాధించారు. అనంతపురంలోని జేఎన్టీయూలో నిర్వహించిన స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పతకాన్ని అందుకున్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని హెడ్ వాటర్ వర్క్స్ నుంచి తోటబడికి తాగునీటిని సరఫరా చేసే మెగా పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్, వాల్వ్ ఫిట్టింగ్ పనులను జరపనుండటంతో సరఫరాకు బుధ, గురువారాల్లో అంతరాయం ఏర్పడనుందని ఎస్ఈ రామ్మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటబడి, పప్పులవీధి, జాకీర్‌హుస్సేన్‌నగర్, బంగ్లాతోట, ఎఫ్సీఐ కాలనీ ట్యాంక్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

‘ఏఆర్ కానిస్టేబుల్ వేధిస్తున్నారు’

నెల్లూరు రూరల్: తిరుపతిలో పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తూ చంపేస్తానని బెదిరిస్తున్నారని నవాబుపేటలోని లక్ష్మీపురానికి చెందిన కవిత వాపోయారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడారు. ఎస్పీ తక్షణమే స్పందించి చర్యలు చేపట్టి తనకు రక్షణ కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని సరస్వతీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల రామ్‌నగర్ ఫీడర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న తరుణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామ్‌నగర్, పాత మిలటరీకాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

ఎస్ఈగా ఉద్యోగోన్నతి



శ్రీనివాసరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ నెల్లూరు సర్కిల్లో ఈఈగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావుకు ఎస్ఈగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు సీఎండీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు మంగళవారం విడుదలయ్యాయి. తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో సివిల్ విభాగానికి ఎస్ఈగా నియమించారు. ఈ క్రమంలో జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, సూర్యఘర్ నోడల్ ఆఫీసర్ శేషాద్రిబాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, బెనర్జీ, పరంధామయ్య తదితరులు శుభాకాంక్షలను తెలియజేశారు.

కార్పొరేషన్లో అంతర్గత బదిలీలు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో గాడితప్పిన పాలనను సరిచేసేందుకు కమిషనర్ నందన్ చర్యలు చేపట్టారు. ‘ప్రక్షాళన లేక.. పాలన సాగక’ అనే శీర్షికన సాక్షిలో ఈ నెల ఆరున ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రెవెన్యూ విభాగంలో ఇద్దరు ఆర్వోలను వారం క్రితం నియమించిన విషయం విదితమే. తాజాగా ఐదుగురు ఆర్ఐలను నియమించడంతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఆర్ఐలను ఇతర విభాగాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. అదే విధంగా పలువుర్ని అంతర్గతంగా బదిలీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: మండల పరిధిలోని తాటిపర్తిపాళెం రైల్వే గేటు వద్ద కృష్ణపట్నం రోడ్డుపై మంగళవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గూడూరుకు చెందిన కామేశ్వరరావు, వెంకటరమణయ్య మోటార్‌బైక్‌పై కృష్ణపట్నం పోర్టుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. తాటిపర్తిపాళెం రైల్వే గేటు వద్ద ఒక్కసారిగా దూసుకొచ్చిన ఆటో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కామేశ్వరరావు, వెంకటరమణయ్య గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ప్రైవేట్ క్లినిక్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరంలోని 18వ డివిజన్లో పారిశుధ్య పనులను ఎంహెచ్ఓ చైతన్య మంగళవారం పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోయి ఉండటాన్ని గమనించారు. కాలువల్లో పూడిక సక్రమంగా తీయక, దోమల వ్యాప్తికి కారణమవుతున్న సెక్రటరీ, ఆప్కాస్ మేస్త్రీలకు నోటీసులను జారీ చేశారు. కాలువల్లో పూడిత తీయడంతో పాటు ఖాళీ స్థలాల్లో చెత్తను వెంటనే తొలగించాలని ఆదేశించారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైతన్య

హనుమజ్జయంతి మహోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): హనుమజ్జయంతిని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో విశేష పూజలను గురువారం నిర్వహించనున్నామని మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తానయ్య, సోమిశెట్టి వెంకటరత్నం తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మందిరంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. ప్రసన్నాంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు, మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి, ఆకుపూజ, సిందూరార్చన తదితరాలను నిర్వహించనున్నామని వివరించారు. నగరోత్సవాన్ని నిర్వహించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు. మందిర కమిటీ కోశాధికారి కొప్పరపు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు అప్పల సత్యం, వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండప కమిటీ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, ఆలయ ప్రధానార్చకుడు బృందావనం శ్రీనివాసదీక్షితులు తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

⇨ మూలాపేట చమ్మండివారితోటలో కొలువైన అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను బుధవారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నామని పాండురంగస్వామి, ఇసనాకుల మల్లికార్జున తెలిపారు. గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయని వివరించారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మరింత బలోపేతం చేసి, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో 28, 29వ డివిజన్ల పార్టీ నేతలు, కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను మోసం చేస్తూ.. హింసా రాజకీయాలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ 28, 29వ డివిజన్ల ఇన్‌చార్జీలుగా నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, జాకీర్‌హుస్సేన్‌ను నియమించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ సత్తార్, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకటజ్యోతి, ఎస్సీ సెల్ రాష్ట్ర నేత బద్దెపూడి రవీంద్ర, అబ్దుల్ సలీం, శ్యామ్‌సింగ్, కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్, రోహిత్‌రెడ్డి, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నెల్లూరు (పొగతోట): శిక్షణ సమయంలో అన్ని అంశాలపై అవగాహన పెంచుకొని ఉత్తమంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ సిస్టమ్ తదితర అంశాలపై శిక్షణ పూర్తి చేసిన ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులకు సర్టిఫికెట్లను నగరంలోని జెడ్పీ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులతో అరుణమ్మ

రక్తదానం పుణ్యకార్యం

నెల్లూరు(అర్బన్): రక్తదానం పుణ్యకార్యంతో సమానమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో గల బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. తన మిత్రులతోనూ రక్తదానం చేయించారు. రక్తదాతలు నవీన్, మహేష్, రెడ్‌క్రాస్ కార్యదర్శి మస్తానయ్య, న్యాయవాదులు రంగరాజన్, నాగశ్రీనివాస్, ఏడుకొండలు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై నెల పాటు కార్యక్రమాలు

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(అర్బన్): రానున్న నెల పాటు యోగాపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్‌ను మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగాపై ప్రజలందరికీ తెలిసేలా బుధవారం నుంచి వచ్చే నెల 21 వరకు షెడ్యూల్ ప్రకారం జిల్లాలో కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి, జెడ్పీ సీఈఓ, డీఎంహెచ్ఓ, ఆయుష్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మండల స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలను ఎంపీడీఓలు నిర్వహించాలన్నారు. జిల్లా, డివిజనల్, మండల స్థాయి అధికారులు వారి శాఖల పరిధిలో తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు.